క్లుప్తంగా

అన్నదాన ట్రస్టుకు విరాళాలు



దాతలను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పలువురు భక్తులు అన్నదాన ట్రస్టుకు విరాళాలు అందజేశారు. ఆలయంలో జరిగే కల్యాణానికి వచ్చిన భక్తులు వీబీకే రామలింగేశ్వరరావు రూ.50 వేలు, ఎస్ నవీన్‌కుమార్ రూ.10,001 శుక్రవారం ఆలయ స్వస్తి వాచకులు నాగాభట్ల రవిప్రసాద్‌శర్మకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేష వస్త్రం అందజేసి సత్కరించారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం: కొత్త కోర్సుల ప్రవేశం కోసం ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రభాకర్ తెలిపారు. ముమ్మిడివరంలో డాక్టర్ ఎంజీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో తరగతులు నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాలకు సంబంధించి బీఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బోటనీ, మేజర్ సబ్జెక్టుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని వివరించారు. కొత్త కోర్సులు బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, ప్రవేశానికి కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తారన్నారు. కళాశాలలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేస్తారని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి గ్రామంలో ప్రధాన శ్మశాన వాటిక వద్ద ఉన్న చెరువులో పూడికతీత పనులు కొన్ని రోజులుగా ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం చెరువు పూడికతీత అభివృద్ధి పనులను స్థానిక సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ పరిశీలించారు. గ్రామంలోని ఉపాధి కూలీలకు ఇప్పటివరకు వేసవిలో 10 వేల 300 పని దినాలు కల్పించినట్టు సర్పంచ్ శ్రీదుర్గ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నాడ చిన్ని, చప్పిడి శ్రీనివాసరావు, దొంగ శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ ముళ్ల ధనలక్ష్మి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

30న హోమ్‌గార్డ్ పోటీ పరీక్ష

యానాం: పుదుచ్చేరి పోలీస్ శాఖలో భర్తీ చేసేందుకు హోమ్ గార్డు (పురుషులు, మహిళలు) ఉద్యోగాల పోటీ పరీక్ష ఈ నెల 30న నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ కార్యదర్శి పంకజ్‌కుమార్ ఝా శుక్రవారం ఇక్కడ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ పరీక్ష జరుగుతుందని చెప్పారు. వాస్తవానికి ఈ పరీక్షను ఈ నెల 16న నిర్వహించాల్సి ఉందని, అయితే అదే రోజు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఉండటంతో, హోమ్‌గార్డు పరీక్షను రీషెడ్యూల్ చేసినట్టు వివరించారు. త్వరలో హాల్ టికెట్లు డౌన్‌లోడ్, ఇతర సమాచారం వెబ్‌సైట్ ద్వారా తెలియజేస్తామన్నారు.

ఢిల్లీ వెళ్లిన మంత్రి నమశ్శివాయం

యానాం: బీజేపీ అధిష్టానం అత్యవసర పిలుపు మేరకు యానాంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 61వ పుట్టిన రోజు వేడుకలకు హాజరైన పుదుచ్చేరి హోమ్ మంత్రి శుక్రవారం హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. పుదుచ్చేరి పార్లమెంటరీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన నమశ్శివాయం.. కాంగ్రెస్(ఇండియా కూటమి) అభ్యర్థి వైథిలింగం చేతిలో ఓటమి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 6న మల్లాడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు సీఎం రంగసామి, స్పీకర్ సెల్వంతో ఆయన యానాం విచ్చేశారు. ఇక్కడ ఉండగానే ఆయనను బీజేపీ అధిష్టానం తక్షణం ఢిల్లీ రావాలని కోరడంతో, ఆయన పుదుచ్చేరి వెళ్లకుండానే మార్గం మధ్యలో రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లారు.

బాధితుడికి ఆర్థిక సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బుచ్చెంపేటకు చెందిన జొన్నకూటి శ్రీప్రకాష్ వయస్సు 22 సంవత్సరాలు. ఇతనికి రెండు కిడ్నీలు పాడైపోవడంతో గత కొన్ని నెలల నుంచి డయాలసిస్ చేయిస్తున్నారు. వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో, అతని కుటుంబ సభ్యులు కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను వైద్యానికి సాయం కోరారు. సంస్థ సభ్యులు శ్రీప్రకాష్ ఇంటికి వెళ్లి, రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ముక్కు మూస్తేనే.. ముందుకెళ్లేది..!

- ఎన్‌హెచ్ అధికారుల నిర్వాకంతో అపరిశుభ్రత
- సక్రమంగా లేని డ్రైనేజీ వ్యవస్థ
- నిర్వహణ లేక ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ స్థానికుల ఆగ్రహం





సుంకరపాలెం బైపాస్ జంక్షన్ నుంచి ద్రాక్షారామ రహదారిలోకి పారుతున్న డ్రైనేజీ నీరు, జాతీయ రహదారిలో నిలిచిపోయిన వర్షపు నీరు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం జంక్షన్‌లో ప్రయాణించాలంటే సాహసమనే చెప్పాలి. ముక్కు మూసుకోకపోతే, ఆ మార్గంలో ప్రయాణించడం నరకయాతనే. ఎన్‌హెచ్ అధికారుల నిర్వాకంతో అక్కడ డ్రైనేజీ నీరు రహదారిపై పారుతూ అపరిశుభ్రత తాండవిస్తోంది. హైవే నుంచి ద్రాక్షారామకు వెళ్లే రహదారిలో నిత్యం మురుగు నీరు పారుతుండడంతో దుర్గంధం వెదజల్లుతూ స్థానికులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే చాలు వర్షపు నీరు రహదారిపై నిలిచిపోతోంది. నీరు పోయే మార్గం లేకపోవడంతో చెరువును తలపిస్తోంది. గత కొన్నేళ్లుగా సమస్యను పరిష్కరించమని కోరుతున్నప్పటికీ ఏ ఒక్క హైవే అధికారి పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి 216 విస్తరణలో భాగంగా రహదారి చెంతనే డ్రైనేజీని నిర్మించారు. డ్రైనేజీ నిర్వహణ లేకపోవడం, పూడికలు తీయకపోవడంతో చెత్తాచెదారాలు పేరుకుని, నీరు పారని పరిస్థితి నెలకొంది. దీంతో మురుగు నీరంతా రహదారిపైకి చేరుతోంది. నీరు బయటకపోయే మార్గం లేకపోవడంతో నిల్వ ఉండి, దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాటు రహదారిపై నీరు నిలిచిపోవడంతో అనేకమంది జారిపడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

విద్యార్థులకూ తప్పని పాట్లు

ఈ ప్రాంతంలో కళాశాలలు, పాఠశాలలు అధికంగా ఉండడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడున్నారు, అదేవిధంగా యానాం నుంచి ద్రాక్షారామ వెళ్లే ప్రయాణికులు అదే ప్రాంతంలో బస్సుల కోసం వేచి ఉండాలి. దుర్గంధం భరించలేక ముక్కుమూసుకుని అవస్థలు పడుతున్నారు. స్థానిక వ్యాపారుల దుస్థితి వర్ణనాతీతం. నిత్యం మురుగు నీటిలోనే సంచరించాల్సిన పరిస్థితి. పలుమార్లు ప్రత్యక్ష ఆందోళన చేసినప్పటికీ, అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకున్న నాథుడే లేడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్థానికుల ఆందోళన హెచ్చరిక

నేషనల్ హైవే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలో పూడికలు తొలగించడంతో పాటు, డ్రైనేజీ నీరు సక్రమంగా బయటకు వెళ్లేలా పూర్వ డ్రైనేజీని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. డ్రైనేజిని పునరుద్ధరించి మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, లేకుంటే తీవ్ర స్థాయిలో ఆందోళన చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

అనేక ఇబ్బందులు పడుతున్నాం



నేను జంక్షన్‌లో మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్నాను. డ్రైనేజీ నుంచి మురుగునీరు రహదారిపైకి రావడంతో నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నాను. భరించలేని దుర్గంధం వెదజల్లుతుండడంతో పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. మురుగునీరు చేరడంతో వినియోగదారులూ రాక వ్యాపారం పూర్తి స్థాయిలో సాగడం లేదు.

– కాదా రాము, వ్యాపారి

పాదచారులు, విద్యార్థులకు అవస్థలు



డ్రైనేజీ సమస్య కారణంగా పాదచారులు, వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుంకరపాలెం జంక్షన్ నుంచి పవిత్ర పుణ్యక్షేత్రాలైన ద్రాక్షారామ, కోటిపల్లి వెళ్లే ప్రయాణికులు ఇక్కడే వేచిఉండాల్సిన పరిస్థితి. అలాగే ఈ ప్రాంతంలో పాఠశాలలు, కళాశాలలు ఉండడంతో నిత్యం విద్యార్థులు రహదారిపై వేచి ఉండి, డ్రైనేజీ దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– అడబాల శివ, స్థానిక టీ వ్యాపారి

శాశ్వత పరిష్కారం చూపాలి



సుంకరపాలెం జంక్షన్‌లో డ్రైనేజీ సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి. ఎన్నో నెలలుగా ఈ సమస్య ఉన్నప్పటికీ, ఏ ఒక్క అధికారి పట్టించుకోకపోవడం దారుణం. డ్రైనేజీ నీరు రహదారిపై నిల్వ ఉండడంతో వాహనాలు జారిపడి అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అనేక సార్లు ఈ సమస్యపై ఆందోళన చేసిన ప్పటికీ అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికైనా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– చీకట్ల నాగేశ్వరరావు, అధ్యక్షుడు, పూలే ప్రజా చైతన్య వేదిక

యాచకులకు ఆహార పొట్లాల పంపిణీ



అమలాపురంలో వృద్ధురాలికి ఆహార పొట్లాన్ని అందజేస్తున్న జానీ

అమలాపురం టౌన్: ఫ్రెండ్స్ ఫర్ ఫీడింగ్ (ఎఫ్3) సంస్థ ప్రతినిధులు పట్టణంలోని దాదాపు 75 మంది యాచకుల ఆకలి తీర్చేందుకు శుక్రవారం మధ్యాహ్నం ఆహార పొట్లాలు అందజేశారు. ఎఫ్3 సేవా సంస్థ వ్యవస్థాపకుడు పఠాన్ అబ్బానీ (జానీ) ఆధ్వర్యంలో ఆయన మిత్ర బృందం ఈ సేవా కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా జానీ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం పట్టణంలో యాచకులకు ఆహార పొట్లాలు అందజేస్తున్నామని చెప్పారు. అలాగే ప్రతి మంగళవారం పట్టణంలో 30 మంది పేదలకు మధ్యాహ్నం బిర్యానీ పొట్లాలు, ప్రతి గురువారం మధ్యాహ్నం అమలాపురం రూరల్ మండలం ఇమ్మిడివప్పాడు గ్రామంలోని మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలోని పండుటాకులకు భోజనాలు సమకూర్చుతున్నామని వివరించారు. ఇవి కాకుండా పట్టణంలో కడు పేదలు పది మందిని గుర్తించి, వారికి ప్రతి రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం ఆహార పొట్లాలను తమ సంస్థ ప్రతినిధులు వారి వద్దకే వెళ్లి అందజేస్తున్నారని జానీ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని యాచకులకు ఆహార పొట్లాలు పంపిణీ చేసిన కార్యక్రమంలో ఎఫ్3 సంస్థ ప్రతినిధులు ఆదినారాయణ, నరసింహమూర్తి, మలిమ్, భర్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 10న సదస్సు



గ్రాంటు గ్రామంలో రైతు సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాజబాబు, రైతులు

తాళ్లరేవు: మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న ఉదయం 9 గంటలకు పి.మల్లవరం పంట కాలువ వద్ద సదస్సు నిర్వహించనున్నట్టు ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సులో ప్రధానంగా సాగునీటి సమస్యకు కారణమైన పంట కాలువల్లో పెరిగిపోయిన పూడికలు, ఇంజరం వంతెన నిర్మించక పోవడం, ప్రత్యామ్నాయ రోడ్డు తొలగించకపోవడం, పంట పొలాలకు వచ్చే సాగునీటిని చమురు సంస్థలు తరలించుకుపోవడం తదితర సమస్యలపై చర్చిస్తారని చెప్పారు. ఈ సదస్సుకు ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులతో పాటు, మండల ఉన్నతాధికారులు కూడా హాజరయ్యేలా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో రైతులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సదస్సుకు చిన్న, సన్నకారు రైతులు, భూ యజమానులు సదస్సులో పాల్గొనాల్సిందిగా రాజబాబు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పితాని సత్యనారాయణ, పేరాబత్తుల సాయినరేంద్ర, భైరవమూర్తి, పిల్లి శ్రీను, సూరంపూడి సూరిబాబు, మేడిశెట్టి ఏడుకొండలు, బాదం సత్యనారాయణ, కొప్పిశెట్టి రామకృష్ణ గంజా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తీరం వెంబడి పశువులు మాయం!

మాఫియా దుశ్చర్యగా అనుమానాలు



కందికుప్ప సమీపంలో ఓ రైతు పొలంలో చెట్టుకు కట్టిన ఆవులు

కాట్రేనికోన: మండలంలో కొత్తపాలెం లైట్ హౌస్ ప్రాంతం, మడ అడవులు, సముద్ర తీరం వెంబడి సరుగుడు తోటల్లో సంచరిస్తున్న ఆవులు, గేదెలను పశువుల మాఫియా తరలించుకుపోతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దుశ్చర్యకు ఎవరు అడ్డుకట్ట వేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పశువుల మాఫియా.. కొందరు స్థానికులతో కుమ్మక్కై, గుట్టుచప్పుడు కాకుండా బొలేరో, టాటా ఏస్ వాహనాల్లో పశువులను తరలించుకుపోతున్నట్టు చర్చించుకుంటున్నారు. మండలంలో పాడి రైతులు పాలు ఇవ్వని, గర్భం దాల్చిన ఆవులు, గేదెలను, దూడలను మడ అడవులు, సముద్ర తీరం వెంబడి ఉన్న సరుగుడు తోటల్లో వదిలి వేస్తారు. మండలంలోని చెయ్యేరు, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, వానపల్లిపాలెం, గచ్చకాయపోర, చిర్రయానం, బలుసుతిప్ప, కందికుప్ప, పల్లంకుర్రు, దొంతికుర్రు, తదితర ప్రాంతాలకు చెందిన పాడి రైతులు పాడి పశువులు పోషించలేక మడ అడవులు, సరుగుడు తోటల్లో విడిచిపెడతారు. ఆవులు, గేదెలు గర్భం దాల్చి ఈనే సమయాన్ని గుర్తించి, ఇంటికి తెచ్చుకుంటారు. మగసానితిప్ప, కందికుప్ప లైట్ హౌస్ ప్రాంతంలోని మడ అడవులు, సరుగుడు తోటలు, చిర్రయానం నుంచి కొత్తపాలెం మొగ ప్రాంతం వరకూ సముద్ర తీరం వెంబడి వందలాది పశువులు సంచరిస్తూ ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో సంచరించే ఆవులు, గేదెలు స్థానికులకు చెందినవి కాకపోవడం, ఇతర ప్రాంతాలకు చెందిన పాడి రైతులవి కావడంతో కొందరు స్థానికుల సహకారంతో దళారులు పశువులను తరలించుకుపోతున్నారు. పశువుల మాఫియా అదను చూసి పశువులను వాహనాల్లో కబేళాలకు తరలించుకుపోతున్నారని అంటున్నారు. కాట్రేనికోన పోలీసు స్టేషన్‌లో పాడి గేదేలు కనబడటం లేదని పలు ఫిర్యాదులు ఉన్నాయి. కందికుప్పకు చెందిన పాడి రైతు గేదె పాలు తగ్గిపోవడంతో గర్భం దాల్చిన తర్వాత లైట్ హౌస్ ప్రాంతంలో సరుగుడు తోటల్లో వదిలివేశారు. గేదెను వారం రోజులకు ఓసారి వెళ్లి చూసుకునేవారు. గేదె ఆచూకీ లేకపోవడంతో తీర ప్రాంతం వెంబడి మడ అడవులు, సరుగుడు తోటలు, పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో గత నెల 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న పోలీసులు దీనిపై దృష్టి సారించలేకపోయారు.


అదుపులోకి వాహనం

గురువారం రాత్రి టాటా ఏస్ వాహనంలో పశువులను కబేళాలకు తరలించుకు పోతున్నట్టు స్థానికుల సమాచారంతో, పోలీసులు ఆ వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆవులను కందికుప్ప సమీపంలో వదిలివేసిన పోలీసులు, వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. దీనిపై కాట్రేనికోన ఎస్సై నాగేశ్వరరావును వివరణ కోరగా, ఆవులను తరలిస్తున్న వాహనాన్ని అదుపులోనికి తీసుకున్నామని, అయితే ఆవులను స్థానికుల నుంచి కొనుగోలు చేశామని డ్రైవర్ తెలిపారని చెప్పారు.

బ్రెయిన్ ట్యూమర్.. బీ కేర్‌ఫుల్

- ఆధునిక ఆపరేషన్లతో తొలగింపు
- పిల్లలు, పెద్దల్లోనూ వ్యాధి వచ్చే అవకాశం
- నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే





రాయవరం: ఆధునిక జీవనశైలితో బ్రెయిన్ ట్యూమర్లు పెరిగిపోతున్నాయి. సకాలంలో వాటిని గుర్తించకపోవడంతో ప్రాణాంతకంగా మారుతున్నాయి. పెద్దలతో పాటుగా పిల్లల్లోనూ ఈ సమస్య కనిపిస్తోంది. ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే నిర్వహిస్తున్నారు.

వ్యాధికి కారణాలు

బ్రెయిన్ ట్యూమర్లు జన్యుపర లోపాల వల్ల, వంశపారంపర్యంగా వస్తాయి. బ్రెయిన్‌కు రేడియేషన్ సోకడం వలన కూడా సమస్య ఉత్పన్నమవుతుంది. సెల్‌ఫోన్ విపరీతంగా వాడడం వల్ల రేడియేషన్ సోకి మెదడులో గడ్డ వచ్చే అవకాశాలు చాలా మెండుగా ఉన్నాయి. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వయసుల వారికి బ్రెయిన్ ట్యూమర్లు వస్తాయి.

ఆధునిక సర్జరీలతో మెరుగైన జీవితం

న్యూరో సర్జరీలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులతో బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ చేయించుకున్న వారు గతంలో కంటే చాలా మెరుగైన జీవితాన్ని గడపవచ్చు. ఆధునిక వైద్యం ద్వారా నూటికి 90 శాతం రోగికి మంచి జీవితాన్ని ప్రసాదించవచ్చు.10 శాతం మాత్రమే ప్రాణాంతకమైనవి. జనాభాలో ఒక శాతం ప్రజలు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నారు. అత్యాధునిక వైద్య పరికరాలతో వైద్యులు బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ చేస్తున్నారు. ఆపరేషన్ చేసేందుకు నాలుగు నుంచి ఎనిమిది గంటల సమయం పడుతుంది. సుమారు రూ.మూడు లక్షల ఖరీదు చేసే ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నారు.

లక్షణాలివే..

బ్రెయిన్‌లో సర్వసాధారణంగా సెల్స్ చనిపోయి కొత్తవి పుట్టుకొస్తుంటాయి. కొన్ని సమయాల్లో కణాలు చనిపోకుండానే కొత్త కణాలు పుట్టుకొచ్చి, కొత్తగా వచ్చిన కణాలు ట్యూమర్‌గా (గడ్డ) మారతాయి. కొన్ని గడ్డలు క్యాన్సర్‌గా మారి ప్రాణాలు తీస్తాయి. కొన్ని గడ్డలు ప్రమాదకరమైనవి కావు. ఆపరేషన్ చేసి తొలగించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్ ఉన్నవారిలో విపరీతమైన తలనొప్పి వస్తుంది. వాంతులు అవ్వగానే తలనొప్పి తగ్గుతుంది. ఎక్కువగా ఉదయం వేళల్లో ఈ సమస్య కనిపిస్తుంది. మాట్లాడటం కష్టంగా ఉంటుంది. వినికిడి సమస్య, చూపు మసకబారడం, నడవడం కష్టంగా ఉంటుంది. ట్యూమర్ సైజును బట్టి, అది బ్రెయిన్లో ఏర్పడిన ప్రదేశాన్ని బట్టి, రకాన్ని బట్టి లక్షణాలు ఒక్కో మనిషిలో ఒక్కో రకంగా కనిపిస్తాయి.

ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు



బ్రెయిన్ ట్యూమర్లను ప్రాథమిక దశలోనే గుర్తించే ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ప్రాథమిక దశలోనే తలలో గడ్డలను గుర్తిస్తే ఆపరేషన్లతో పని లేకుండా మందులతో పూర్తిగా నయం చేయవచ్చు. అన్ని ట్యూమర్లకు ఆపరేషన్లు చేయాల్సిన పనిలేదు. ముందుగా గుర్తిస్తే రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ తదితర వైద్య విధానాల ద్వారా నయం చేయవచ్చు.

– డాక్టర్ కార్తీక్, ఎండీ జనరల్ మెడిసిన్, ఇన్‌చార్జ్, డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, అమలాపురం

మలేరియా నియంత్రణపై అవగాహన ర్యాలీ



మలేరియా నివారణపై ర్యాలీ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

అల్లవరం: జాతీయ కీటక జనిత వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా సామంతకుర్రు పల్లిపాలెంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్త ఆరోగ్య సమతుల్య సాధనకు మలేరియాపై వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేయాలన్నారు. మలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా దోమతెరల వాడకం, మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం శుభ్రవారంగా పాటించాలని కోరారు. అనంతరం గ్రామంలో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎస్వీ ప్రసాద్, అమలాపురం సబ్ యూనిట్ అధికారి ఎన్‌వీ రామారావు, ఎల్‌వీ రంగనాథ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లతో భవిష్యత్తు నాశనం

- యువతతో ఎస్పీ రాజశేఖరన్



యువకులతో కలిసి క్యారమ్స్ ఆడుతున్న ఎస్పీ రాజశేఖరన్, పోలీసులు

యానాం: నవ సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని, వారు చెడు అలవాట్లతో తమ శక్తి సామర్థ్యాలను కోల్పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ రాజశేఖరన్ ఉద్బోధించారు. యువకుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేలా పుదుచ్చేరి పోలీస్ శాఖ వివిధ క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం పలు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల అలవాటుతో తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హెచ్చరించారు. అనంతరం యువకులతో కలిసి ఆయన పోటీల్లో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ షణ్ముగం, ఎస్సైలు మురుగునాదం, శేరు నూకరాజు, ప్రముఖ న్యాయవాది మాజేటి నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.